# పొత్తూరి విజయలక్ష్మి హాస్యకథలు




పొత్తూరి విజయలక్ష్మి

# విషయసూచిక


1. ఆలిండియా రేడియో ---------------------------- 05
2. కరెంటు సంబరం ---------------------------- 10
3. కారులో షికారు ---------------------------- 14
4. చదువు మధ్యలో ఏదో కాస్త... ---------------------- 19
5. భాగవత సారం ---------------------------- 23
6. ఇరుగూ పొరుగూ ఆసరా ------------------------- 27
7. మహిళామండలీ-కుట్టుమిషనూ ----------------------- 32
8. ప్రయాణంలో మనిషి సాయం ----------------------- 37
9. కూరల పేరంటం ---------------------------- 41
10. స్కూలుమీద కర్ర పెత్తనం ------------------------- 45
11. దొంగ అట్లు ---------------------------- 49
12. సర్వం శ్రీ జగన్నాథం ---------------------------- 53
13. నా పెళ్ళి సమస్య తీరింది ------------------------- 57
14. పదిహేను పైసలకి ఆరుగురు పిల్లలు ------------------ 61
15. ఉత్తరీయం ఇస్త్రీ ---------------------------- 65
16. చండశాసన మహారాజు ------------------------- 68
17. సినిమాకి వెళ్తే రిక్షా ఎక్కం ------------------------- 72
18. అన్నానా? ఏమనీ?? ---------------------------- 76
19. మగపెళ్ళి వారమండీ! ---------------------------- 80
20. నీళ్ళు తెచ్చుకునే చీరె ---------------------------- 84
21. ఇంటినిండా ఇంగిలీషు ---------------------------- 88
22. యుద్ధానికి సిద్ధం ---------------------------- 92
23. సభల సంరంభం ---------------------------- 96
24. పండుగాడు ---------------------------- 100

నిన్న అది మాట్లాడుతూ ఉంటే వినకపోతిరి. అలిగినట్టుంది.
ఇవాళ మాటా పలుకూ లేదు. వెళ్లి కాస్త బతిమాలరూ...



# ఆలిండియా రేడియో

**మా** ఊరికి కరెంటు వచ్చిన కొద్ది రోజులకి మా నాన్నగారికి పెదనందిపాడు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ ఊళ్ళో కరెంటు లేదు.

వాడకపోతే మూలపడిపోతుందని మా దగ్గర ఉన్న రేడియో మా తాతగారింటికి తరలించారు. 'అయ్యో! వద్దు నాయనా. అల్లుడి వస్తువులు వాడుకోవడం అప్రతిష్ఠ' అని తాతగారు అన్నా లెక్కచెయ్యలేదుట.

"ఫర్వాలేదులెండి. ఫ్యాన్లు అవీ గుంటూరు పంపిస్తున్నాను. ఇక్కడ రేడియో లేదుగా, అందుకే ఇక్కడ ఉండనివ్వండి. ఇక్కడైతే భద్రంగా ఉంటుంది" అన్నారుట. రేడియో పెట్టగానే అయిపోయిందా! అదెలా వాడాలో చెప్పాలిగా. రెండు గంటలు బోధించారుట. అయితే అన్నీ విని "అట్లా ఊరూరు తిరగలేంలెండి. విజయవాడలో ఉండనివ్వండి" అన్నారుట. విజయవాడ స్టేషను అయినా హైదరాబాదు స్టేషను అయినా ఒక్కటే అని నచ్చచెప్తే మీరేదో గౌరవంకొద్దీ చెప్తున్నారుగానీ విజయవాడ ఎక్కడ? హైదరాబాదు ఎక్కడ? అన్నారుట.

"సరే! చివరికి విజయవాడలోనే ముల్లు ఉండేలా సవరించి ఉంచారు నాన్నగారు. తెల్లవారి ఆరుగంటలకు స్విచ్ ఆన్ చేసుకునేవారు. ప్రసార సమాప్తి కాగానే ఆపేసేవారు. రేడియో వచ్చాక పూజ తగ్గించానని మీ అత్తగారు సణుగుతోంది గానీ నాకు బాగా కాలక్షేపం అవుతోంది అని ఉత్తరం రాశారు వారం రోజుల తర్వాత.

"నాతోపాటు దగ్గరున్నవాళ్ళు పదిమంది దాకా వచ్చి రేడియో వింటున్నారు. అలా మందలకొద్దీ జనం వింటే రేడియో శక్తి తగ్గిపోతుందని మీ అత్తగారు గొడవ చేస్తోంది. అంతేనంటారా? మీరే విషయం కార్డుముక్క రాస్తే కావాలంటే అందరినీ తోలేసి నేనొక్కడినే వింటాను" అని రాశారు మరో పక్షం తర్వాత.

నాన్నగారు నవ్వుకుని ఊరుకున్నారు. అమ్మ వెంటనే కార్డు రాసింది. 'ఎంత మంది విన్నా ఏమీ కాదు. అమ్మ సణుగుడు పట్టించుకోకండి' అంటూ.

వారం తిరక్కుండానే అమ్మమ్మ దగ్గర్నించి ఉత్తరం. కూతురిమీద కోపం వచ్చింది కాబోలు. చిరంజీవి బాబుకి అంటూ అన్నయ్య పేరు మీదే రాయించింది. "నేను చెప్తే వినలేదు. నన్ను ఆట పట్టించారు మీ తాతయ్యా, అమ్మానూ. వసారా పట్టకుండా జనం జేరిపోతే దానికి శోషరాదూ! కాస్త నీరసానపడింది. కంఠంలో ఖంగుతనం తగ్గింది. మూడోనాడు గరగరలాడింది. మర్నాడు మాట పడిపోయింది" అంటూ ఎవరిచేతో రాయించింది. మర్నాడు తాతయ్యగారి ఉత్తరం. ఉభయకుశలోపరి అనంతరం అనేకానేక క్షమాపణలతో మొదలూ 'మీరే వచ్చి చూడాలి. వాళ్ళూ వీళ్ళూ బాగు చేస్తానంటున్నారుగానీ నాకు నమ్మకం లేదు' అని రాశారు. అటువైపు వెళ్ళినప్పుడు చూసి వచ్చారు నాన్నగారు. రిపేరు ఏం లేదు. చిమ్మెట లోపలికి దూరి ముల్లు కదిపేసింది అన్నారుట.

ఏది ఏమైనా అల్లుడు మేధావి. అటు కారుగానీ ఇటు రేడియోగానీ క్షణంలో రిపేర్ చేస్తారు అని ఆనందపడ్డారుట ఆ ఆదిదంపతులు. ఆ తర్వాత జనం చేరకుండా కట్టడిచేసిందట అమ్మమ్మ. రెండు నెలలకి అమ్మమ్మ మీద దిగులుగా ఉందని గొడవ చేస్తుంటే మనిషినిచ్చి పంపించారు.

నేను వెళ్ళిన మర్నాడే తాతయ్యగారు ఏదో పనిమీద దమ్మనవారిపాలెం వెళ్ళారు. వెళ్ళేటప్పుడు కరెంటు పోయింది. అందుకే మళ్ళీ కరెంటు రాగానే ఖంగున మోగింది రేడియో. పొయ్యి వెలిగించే ప్రయత్నంలో ఉన్న అమ్మమ్మ కంగారుగా 'వచ్చే వచ్చే'

అంటూ గుమ్మం తట్టుకు పడబోతూ వచ్చి రేడియో ఎదురుగా కూర్చుని కాసేపు విన్నది.

ఆ తర్వాత 'బంగారాలూ' అని నన్ను పిల్చింది. వెళ్ళా.

"ఇక్కడ కూచుని కాస్త రేడియో వినమ్మా. నాకవతల బోలెడు పనుంది" అంది.

నాకాశ్చర్యం వేసింది. 'పనుంటే వెళ్ళి చేసుకో' అన్నా.

"మరి రేడియో ఎవరు వింటారు?" అంది.

"వినకపోతే ఆపేయ్" అన్నాను.

"ఆ... ఆ... అమర్యాద కాదుటే" అంది.

"ఏం అమర్యాద... వింటే వింటాం. విసుగేస్తే ఆపేస్తాం" అన్నాను.

"నీకు పెత్తనం ఇస్తే సర్వమంగళం చేసేస్తావు. నా మాట వినవే – ఆపద్దు, రేడియో వినవే" అని బతిమాలింది.

"అలా వినక్కర్లేదు. ఆపేయ్" అన్నాను మొండిగా.

మేము చాలా వాదులాడుకుంటూ ఉండగానే మంచినీళ్ళు పోసే భ్రమరాంబ వచ్చింది.

"విశాలమ్మ కాస్త కరివేపాకు తెమ్మంది" అంటూ.

అమ్మమ్మ ప్రాణం లేచివచ్చింది. "సమయానికి దేవుడల్లే వచ్చావు భ్రమరాంబా. నా ప్రాణం కుదుటపడింది" అంది.

"ఏవమ్మా ఏం కష్టం వచ్చిందీ?" అంది భ్రమరాంబ.

"ఆయనేమో ఊరికెళ్ళారు. నేనింకా పొయ్యే వెలిగించలేదు. ఇటు చూడబోతే రేడియో వినాలి. ఈ కొరివికి చెప్తే ఎదురు సమాధానాలు చెప్తోంది. కాస్త కూచుని రేడియో విను. నేను అత్తెసరుపడేసి దేవుడికి చెయ్యి చూపించి వచ్చేస్తాను" అంది అమ్మమ్మ.

“ఎవరో పెద్దాయన మాట్లాడుతున్నాడు. నేనేం వింటాను ఎదురుగా కూర్చుని? నాకు మొహమాటం. ఆ వంటేదో నేనే చేసేస్తాను. నువ్వే విను” అని బావి దగ్గరకు వెళ్ళి స్నానం చేసేసి వంట చేసింది. వంటయ్యాక కరివేపాకు కోసుకుని వెళ్ళిపోయింది.

ప్రసార సమాప్తి అయ్యాక నైవేద్యం పెట్టి నాకు అన్నం పెట్టింది అమ్మమ్మ ధుమధుమలాడుతూ.

సాయంత్రం దీపాలు పెట్టే వేల్టికి కాస్త ముందే వచ్చేసింది విశాలమ్మగారు.

“రా పిన్నీ” అంది అమ్మమ్మ.

“విషయం అంతా భ్రమరాంబ చెప్పింది. నువ్వు రేడియో వినాలిగా, పోనీ కాస్త తోడుగా ఉంటుందని వచ్చా” అంది ఆవిడ.

“ఏం చెప్పమంటావు పిన్నీ. చెప్తే దీనికి అర్థం కాదు. అల్లుడు అంత అభిమానంగా ఇచ్చిన వస్తువు. అప్పుడోసారి పాడైపోతే బాగుచేస్తుంటేనే నా ప్రాణం చచ్చిపోయింది. మనం వినాలకున్నప్పుడు చెవులు నిక్కబెట్టుకుని విని, తీరుబడిలేదని దాన్ని వదిలేసి వెళ్ళిపోతే మనసు కష్టపెట్టుకుని మళ్ళీ చెడిపోతే ఏం చేస్తాను?” అంది అమ్మమ్మ.

“నిజమే మరి. అయినా ఎవరైనా ఇంటికొచ్చి మాట్లాడుతుంటే మధ్యలో వెళ్ళిపోతామా? ఇదీ అంతే” అంది విశాలమ్మగారు.

“అది కాదు తాతమ్మా. మా ఇంట్లో రేడియో ఆపేస్తాం” అని నేను చెప్పబోతే దలాయించేశారు.

“మీ ఇంట్లో మీ ఇష్టం తల్లీ. అక్కడంటే మీ నాన్న, మీ రాజ్యం. మాకు ఆయన అల్లుడే. ఆ మర్యాద ఉండాల్సిందే” అన్నారు.

సరే ఏడవండి అని ఊరుకున్నా. కుయ్ మని రేడియో నోరు విప్పింది. ‘ఆకాశవాణి విజయవాడ కేంద్రం’ అంటూ మొదలయింది. ఇద్దరూ మాటలాపేసి శ్రద్ధగా గుళ్ళో కార్తీక పురాణం విన్నట్లు విన్నారు.

మార్కెట్టు ధరవరలు మొదలయ్యాయి. బెజవాడ మార్కెట్టు పప్పులు, మరోచోట

ఉప్పులూ అయ్యాక చేపలు అని మొదలయింది. బొమ్మిడాయిలు, మట్టగుడిసెలు, బొచ్చెలు - ఇలా అన్ని చేపల ధరలూ విన్నారు ముక్కు మూసుకునీ, మొహం మాడ్చుకునీ.

తాతయ్య వచ్చేశారు. హమ్మయ్య అంటూ లేచారు ఇద్దరూ.

"వెళ్తానే అమ్మాయ్. ఏవిటో కంపరంగా ఉంది ఒళ్ళంతా. చెంబుడు నీళ్ళు పోసుకుని ఇంత తిని పడుకుంటాను" అని వెళ్ళిపోయింది తాతమ్మ.

"వంటయ్యిందా?" అన్నారు తాతయ్య.

"నా శార్థం అయింది. ఇంతసేపూ రేడియోతోనే సరిపోయె. ఇంక వంటేం చేస్తాను. ఇదుగో స్నానం చేసి కుంపటి అంటిస్తా" అని వెళ్ళిపోయింది అమ్మమ్మ.




# కరెంటు సంబరం

**మా** చిన్నతనంలో కరెంటు ఉండేది కాదు మా ఊళ్ళో. హాల్లో లాంతరు ఇనపకొక్కేనికి తగిలించేవారు. వంటింట్లోనూ, పడకగదిలోనూ లాంతర్లు. మిగిలినచోట కోడిగుడ్డు దీపాలు. చేత్తో పుచ్చుకుని తిరిగేందుకు రెండు చిన్న లాంతర్లుండేవి. సాయంత్రంపూట ఆ దీపాలన్నీ దగ్గరపెట్టుకుని కిరసనాయిలు పోసి ముగ్గుతో గ్లాసులన్నీ మసి లేకుండా తుడిచి, కత్తెరతో వత్తులు కత్తిరించి సిద్ధంగా పెట్టుకునేది అమ్మమ్మ.

చీకటిపడగానే దీపాలు వెలిగించేవాళ్ళు. భాగ్యవంతుల ఇళ్ళల్లో పెట్రోమాక్స్ లైట్లు వుండేవట.

ఒకసారి మేము సెలవులకు వెళ్ళినప్పుడు ఊరంతా సందడి. ఊళ్ళోకి కరెంటు వస్తుందట! స్తంభాలకోసం గుంటలు తవ్వడం, అంత ఎత్తున వైరుచుట్టలు తేవడం అన్నీ విచిత్రంగా చూశాం. అయిదారిళ్ళవాళ్ళు ఇంటికి కరెంటు పెట్టించుకోవాలనుకున్నారు. అందులో మా ఇల్లు ఒకటి.

ముందు సంబరపడినా ఆ తర్వాత భయపడింది మా అమ్మమ్మ. “ఆ కరెంటీ ప్రమాదకరమైనదిట కదా! మన పార్వతమ్మ వదినగారి దూరపు చుట్టం బెజవాడలో కరెంటీకి అతుక్కుపోయి గుటుక్కుమన్నాడట. ఇప్పుడా కరెంటీ లేకపోతే ఏం? ఇన్నాళ్ళూ గడవలేదా? అట్లాగే గడుస్తుంది” అంది.

“ప్రమాదం ఏమీలేదు. కరెంటు వస్తే ఆ సులువువేరు. కాస్త జాగ్రత్తగా వుంటే చాలు” అంది అమ్మ.

“ఏమోనమ్మా! కాళ్ళకి రబ్బరు చెప్పులు వేసుకోవాలిట. లేకపోతే నేలకి అతుక్కు పోతారుట. అలా అతుక్కుపోతే ఇంకెవరైనా రబ్బరుచెప్పులు వేసుకుని వచ్చి కర్రతో అతుక్కుపోయినవాళ్ళని కొడితేగానీ ఊడిరావుట కాళ్ళు. ఈ వయసులో రబ్బరుచెప్పులు వేసుకుని ఏం తిరుగుతాను?” అంది అమ్మమ్మ.

అమ్మ ఫకాలున నవ్వింది. “ఎవరా చెప్పింది, మా ఊళ్ళో కరెంటు లేదూ! నేను చెప్పులేసుకుని తిరుగుతున్నానా? అక్కడికి వచ్చినప్పుడు నువ్వు చెప్పులేసుకుని తిరుగుతున్నావా? ఆ మాటలేం నమ్మకు” అని తీసిపారేసింది.

అమ్మతో వాదించలేక ఊరుకున్నా మా దగ్గర వాపోయేది.

“మీ అమ్మకేం... చెప్తుంది. అక్కడైతే మీరందరూ వున్నారు. ఇక్కడ మేమిద్దరమే వుంటాం. పోనీ నేను నేలకి అతుక్కుపోతే మీ తాతయ్య ఓ దెబ్బ వేసినా ఫర్వాలేదు గానీ ఆయన అతుక్కుపోయారనుకో... కట్టుకున్న భర్తని కర్రతో ఎట్లా కొడతాను? రౌరవాది నరకాలు పట్టిపోనూ? ఎందుకొచ్చిన ప్రారబ్ధం ఇదంతా” అని బాధపడింది.

“అలా ఏం కాదులే అమ్మమ్మా. మా ఊళ్ళో కరెంటువుంది. ఎవరూ నేలకి అతుక్కుపోలేదు” అని ధైర్యం చెప్పాం.

“మీది బస్తీ కరెంటీ. ఇది పల్లెటూరి కరెంటీ. దానికున్న తెలివితేటలు దీనికుండద్దూ” అంది.

ఆవిడ ఎంత ప్రతిఘటించినా వినలేదు. ఇంట్లో వైరింగ్ చేసి బల్బులు బిగిస్తుంటే మళ్ళీ అడ్డుపడిందిట. “అంటే అన్నానంటారు. అంత ఎత్తున దీపాలు పెడితే నేను ముగ్గుపెట్టి ఎట్లా తుడుచుకుంటాను? కాస్త నేలబారుకి బిగించండి” అందిట. వాళ్ళు నవ్వేసి “ఈ దీపాలు రోజూ తుడవక్కర్లేదమ్మా. మసి ఉండదు కదా” అన్నారుట.

ఎలాగైతేనేం... కరెంటు వచ్చేసింది. ఆ శుభసందర్భంలో మేమంతా వెళ్ళాం. తాతగారు సంబరంగా ఉన్నారుగానీ అమ్మమ్మకి సవాలక్ష సందేహాలు... అమ్మ సమాధానాలు.

"ఒక్కొక్కచోట ఒకటేమీట పెడితే సరిపోయేది. ఇక్కడ మూడు మీటలు పెట్టారు. ఒకటి వంటగదిలోకి, రెండోది భోజనాల గదిలోకి, మూడోది దొడ్లోకట. ఒకటి వెయ్యబోయి ఇంకొకటి వేస్తే ప్రమాదం కాదా!"

"ఏమీ కాదు. అది ఆర్పేసి ఇంకొకటి వెయ్యాలి".

"సరే! కరెంటీ దీపం ఉండగా లాంతరు వాడితే కరెంటీ దీపానికి కోపం వస్తుందా?"

"కోపం రావడానికీ, తాపం రావడానికీ అదేమైనా మనిషా? అయినా కరెంటు దీపం ఉండగా మళ్ళీ లాంతరు ఎందుకు?"

అలా ఎన్నో అనుమానాలు...

ఆ తర్వాత కొన్నాళ్ళకి మళ్ళీ వెళ్ళాం.

"నేను చదువుకోనిదాన్ననీ, ఏమీ తెలియనిదాన్ననీ తాటాకులు కట్టేస్తారు. కరెంటీకి కోపం ఎందుకొస్తుందీ అంది మీ అమ్మ. ఆ కరెంటీకి వున్నంత చుప్పనాతి తనం ఇంకెవరికీ ఉండదు. మామూలప్పుడు పుచ్చపువ్వల్లా వెలుగుతాయా దీపాలు! మొన్నామధ్య గోవిందరాజువాళ్ళు మనింటికొచ్చినప్పుడు ఠపీమని ఆరిపోయాయి. అదేమిటంటే కరెంటీ పోయిందిట. అట్లా పరాయివాళ్ళు వచ్చినప్పుడు పోవడం మర్యాదేనా? ఆనక అంతా అయిపోయి వాళ్ళు వెళ్ళాక తీరిగ్గా వచ్చింది. నాకీ కరెంటీ పద్ధతేం నచ్చటంలేదు. నయానాభయానా చెప్పమంటే మీ తాతయ్య వినరు" అని చెప్పుకుని బాధపడింది.

ముందర కొంచెం అస్తావ్యస్తాపడినా తరువాత కరెంటు దీపాలు చూసి మురిసిపోయింది అమ్మమ్మ.

గాలికి అల్లల్లాడవు. మసిబారిపోవు. బ్రహ్మముడి వేసుకున్నట్లు వెంట తీసుకుపోనక్కర్లేదు. చక్కగా పొందికగా ఉన్నచోటే ఉండి పుచ్చపువ్వులా మెరిసిపోతాయి అని సంబరాలు పడేది.

కరెంటు వచ్చాక ఆవిడ హోదా కూడా పెరిగింది.

పక్కింటి రాఘవమ్మగారు దొడ్డిగోడనుంచి కేకేసి "వదినా! ఇంట్లో గాలాడడం లేదు. పిల్లవెధవలకి దొడ్లో అన్నం పెడతాను. కాస్త మీ లైటు వెలిగిస్తావా?" అని అడిగేది.

"అయ్యో! దానికేం భాగ్యం" అని వెనకాల లైటు వేసేది అమ్మమ్మ.

మర్నాడు తెల్లవారాక ఆవిడ వచ్చి "ఎంతైనా కరెంటు దీపం మహిమే వేరు. మాకొద్దు, మాకు చాలు అని సూకిరాలు పోయే పిల్లలు ఇంకాస్త ఇంకాస్త అంటూ ఇత్తడి గిన్నెడు అన్నం ఊడ్చిపెట్టేశారు వదినా" అని ఫీడ్‌బేక్ ఇస్తే–

"అవును వదినా! అదివరకు నా కీళ్ళు కీచుకీచుమంటూ ఉండేవి. కరెంటీ దీపాలు వచ్చాక సాఫీగా సాగుతున్నాయమ్మా" అన్నది అమ్మమ్మ.

ఈ విషయం విని అపోజిషన్ పార్టీలోని జగన్నాథంగారి భార్య మంచినీళ్ళ బావిదగ్గర ఎద్దేవా చేసిందట. "మరీ బడాయి కాకపోతేనూ... కరెంటు దీపంతో కాళ్ళనెప్పులూ కీళ్ళనెప్పులూ తగ్గుతాయా?" అందిట.

అది తెలుసుకుని "ముక్కానీ ఆవదం దీపాలవాళ్ళు కూడా కరెంటీ గురించి మాట్లాడుతుంటే ఏం చెప్తాం? దమ్ముంటే వందరూపాయలు పెట్టి ఇంట్లోకి కరెంటీ పెట్టించుకుని నెల తిరిగేసరికి మూడుముప్పాలా కరెంటీ ఖర్చు కట్టమను తెలుస్తుంది... సత్తా ఏమిటో? అయినా అమావాస్యనాడు వెన్నెల్లో భోజనం చేస్తాననే తెలివి తక్కువది. దానికేం తెలుసు కరెంటీ గొప్ప?" అంది మా అమ్మమ్మ గర్వంగా.

జర్రున జారిపోయే ముదనష్టపు కార్లంటే
నాకు చచ్చేంత భయమే అమ్మడూ...
ఇదే బెస్టు. అమ్మేయకండేం!



# కారులో షికారు

**నా** జాతకం చాలా మంచిదనేవారు తాతగారు. చిన్నతనంనించీ వాహన యోగం వుంది. నాకు బుద్ధి తెలిసేసరికి పాతకాలం ఫోర్డుకారు ఉండేది మా నాన్నగారి దగ్గర. పన్నెండొందలు పెట్టి కొన్నారుట.

"ఎందుకిది? ఈ డబ్బుకి బోలెడంత బంగారం వచ్చేది" అని సణిగింది మా అమ్మ. ఇంట్లో కూర్చునే అమ్మకేం తెలుసు కారు విలువ?

మా స్కూల్లో అందరూ వీళ్ళకి చిన్నకారుంది అని గొప్పగా చెప్పుకునేవారు. చండశాసనుడు మా లెక్కల మాష్టారు... నేను లెక్కలు తప్పుచేసినా ఏమీ అనేవారు కాదు. క్లాసు లీడరును కూడా ఎప్పుడూ నేనే. మరి ఇదంతా కారు ఉండడం వల్లే కదా!

అప్పుడప్పుడూ మా కార్లో మా తాతగారి ఊరికి వెళ్ళేవాళ్ళం. దార్లో ఏదో జాడ్యం వచ్చి ఆగిపోయేది. కార్లో రిపేరు సామగ్రి సిద్ధంగా ఉండేది. మా నాన్నగారు కారు కింద పడుకుని రిపేరు చేసేవారు. అలా అంచెలంచెలుగా గమ్యం చేరేవాళ్ళం.

ఊరు అంతదూరం ఉండగానే చుట్టుపక్కల చేలల్లో పనిచేస్తున్న జనం మా కారు చూసి 'కరణంగారి అల్లుడుగారి కారొచ్చింది' అని పరుగున వచ్చేవాళ్ళు. 'తోసేస్తాం తోసేస్తాం' అని కారుని తోసుకుంటూ ఊళ్ళోకి తీసుకొచ్చేవాళ్ళు. ఇంటికి జేర్చి 'అమ్మాయిగారూ! పదిరోజులుంటారుగా' అని అడిగేవాళ్ళు. 'లేదు. సోమవారం వెళ్ళిపోతా' అనేది అమ్మ. 'సరే అయితే సోమవారం వస్తాం, కారు తోసేస్తాం' అని హామీ ఇచ్చి వెళ్ళేవారు.

అమ్మమ్మ లోపలినుంచి ఇంత మొహం చేసుకుని వచ్చేది. 'వచ్చారా! ఇంత ఆలస్యమైతే దార్లో కారాగిపోయి ఉంటుంది అనుకున్నాను' అని ఆదరంగా తీసుకు వెళ్ళేది.

"అల్లుడుగారూ! కారు ట్రబుల్ ఇచ్చిందా?" అని అడిగేవారు తాతగారు.

"ఆఁ లేదండీ! కాకపోతే పొన్నూరు దాటాక ఒకసారి, లాకులదగ్గర ఒకసారి, చందోలు మలుపులో ఒకసారీ ఆగింది. బాగుచేశాను. బస్టాండుకి అంతదూరంలో ఉండగా మళ్ళీ అనుమానం వచ్చింది. మనవాళ్ళంతా వచ్చి తలో చెయ్యి వేశారు" అనేవారు నాన్నగారు.

"మన ప్రాంతాలకు వస్తే ఢోకాలేదు. మన బలగం ఉందిగా. మీరు వెళ్ళేరోజు ఒకగంట ముందుగా చెప్తే వచ్చి వాలిపోతారు" అనేవారు తాతగారు.

ఎందుకండీ? అది నడుస్తూనే వుందిగా అంటే–

"మనిషి సాయం లేనిచోట దానికెలాగూ తప్పదు పాపం, మనుషులున్న చోటైనా విశ్రాంతి తీస్కోనివ్వండి" అనేవారు తాతగారు.

శని, ఆదివారాలు ఉండి తిరుగు ప్రయాణం అయ్యేవాళ్ళం. మామూలుగా చేయించిన భారీ పిండివంటలతో బాటు అడుగూ బొడుగూ మిగిలిన నాలుగు కజ్జికాయలూ, రెండు గారెముక్కలూ కూడా బాదం ఆకుల్లో పొట్లం కట్టేది అమ్మమ్మ.

'ఎందుకే అవన్నీ' అని అమ్మ అంటే – 'ఉండనీ. కారాగిపోయినప్పుడు పిల్లలు నోట్లో వేసుకుంటారు' అనేది.

ఎక్కడికి వెళ్ళినా మధ్యలో కారాగిపోవడం మా అమ్మకు చిరాగ్గా ఉండేది.

కానీ మాకు మాత్రం సరదాగానే ఉండేది. చేల వెంబడి పరుగులు తీయొచ్చు. పిల్లకాలువ ఉంటే ఆడుకోవచ్చు. రాళ్ళు వేసి చింతకాయలు కొట్టుకోవచ్చు.

ఒకసారి సెలవుల్లో తిరుపతి ప్రయాణం పెట్టుకున్నాం. తాతయ్యగారు రాలేనన్నారుట... అమ్మమ్మ మాత్రం వచ్చింది. బోలెడన్ని చిరుతిళ్లు మూటలు కట్టి 'కారాగిపోయినప్పుడు తిందాం' అంది సరదాగా.

దూరాభారం మా కారులో ప్రయాణం కష్టం అవుతుందని టాక్సీ మాట్లాడారు. తెల్లగా రాజహంసలా ఉంది అంబాసిడర్ టాక్సీ.

పెందలాడే భోజనాలు చేసి బయలుదేరాం.

రివ్వున దూసుకుపోతోంది టాక్సీ. కాసేపటికి మాకు విసుగేసింది. 'నాన్నగారూ కారెప్పుడాగిపోతుంది?' అని అడిగాం.

'నోళ్లు ముయ్యండి అపశకున పక్షుల్లారా' అని తిట్టింది అమ్మ.

మరికాసపేపటికి అమ్మమ్మకీ విసుగువేసింది. 'బాబూ! కారెప్పుడు ఆగిపోతుందో నాన్నగారిని అడుగు' అంది మా అన్నయ్యతో. ఆవిడ నేరుగా అల్లుడితో మాట్లాడదు మరి!

"ఇదెక్కడి గొడవే! కావాలంటే చెప్పండి అపుతారు. అంతేగానీ ఆగిపోదేం, ఆగిపోదేం అంటే ఇదేమైనా మన డొక్కుకారా? బోలెడు డబ్బుపోసి తెచ్చిన టాక్సీ" అని కసిరింది అమ్మ.

ప్రయాణం బాగానే జరిగింది. ఇంటికి తిరిగివచ్చాం. అమ్మ సంతోషంగా ఉంది. మాకూ, మా అమ్మమ్మకు మాత్రం అసంతృప్తిగా ఉంది. ఆ టాక్సీ వ్యవహారం మాకు నచ్చలేదు.

"అదేం పీడాకారం బయలుదేరితే ఇహ అదే పరుగా! నిలువూ నిదానం ఉండద్దూ? మన కారు బంగారం. ఒకసారి రోడ్డుమీద కారాగిపోతే అల్లుడుగారు రిపేరు చేసేలోపల అడ్డదోవన గోవాడ వెళ్ళి మా పినతండ్రి కూతుర్ని చూసొచ్చాను. విడిగా వెళ్ళాలంటే కుదుర్తుందా? ఇంకోసారి చక్కగా మిరపచేను పక్కన ఆగిపోయింది. దిగి మేలైన మిరపకాయలు చవగ్గా కొనుక్కున్నాం. ఎంతైనా మనకారుకి మన వీలూ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Pothuri+Vijayalakshmi+Hasya+Kathalu+Revised**

* * *